

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

పార్వతీపురం/సీతంపేట రూరల్,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని పార్వతీపురం, భామిని, మెళియాపుట్టి ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి ఈ నెల 25న జరగాల్సిన ప్రవేశ పరీక్ష మార్చి 2వ తేదీకి వాయిదా పడింది. ఈ నెల 19వ తేదీ వరకు విద్యార్థులు నేరుగా,ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ డీడీ అన్నదొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవి గట్టెక్కేదెలా?

- పార్వతీపురంలో మొదలైన తాగునీటి కష్టాలు
- వారానికి మూడు రోజులే సరఫరా
- 50 ఏళ్ల నాటి పైపులైనే దిక్కు
- ఎక్కడికక్కడే లీకేజీ అవుతున్న వైనం
- ప్రతి ఏటా ఇదే పరిస్థితి



నాగావళి నదిలోని నీటిని ఇన్‌ఫిల్టర్ బావులకు మళ్లిస్తున్న దృశ్యం



తాగునీటి ట్యాంకు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురాన్ని తాగునీటి సమస్య వేధిస్తోంది. పార్వతీపురం మున్సిపాలిటీ ఏర్పడి 63 ఏళ్లు అవుతున్నా.. గ్రేడ్ -1 మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 24 ఏళ్లు కావస్తున్నా తాగునీటి సమస్య మాత్రం తీరడం లేదు. వారా నికి మూడు, నాలుగు రోజులకొకసారి మాత్రమే ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. ప్రతి ఏడాది ఈ సమస్య పరిష్కారానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయడం.. తరువాత వాటిని బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు ఉన్నాయి. పార్వతీపురం మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. 55 వేల నుంచి 60 వేల మంది జనాభా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతు న్నాయి. కానీ, అనాధికారికంగా 80 వేల జనాభా ఉన్నట్లు సమాచారం. పార్వతీపురం మున్సిపాలి టీగా మారిన 13 ఏళ్ల తరువాత గరుగుబిల్లి మండలం తోటపల్లి సమీపంలోని నాగా వళి నది నుంచి పార్వతీపురం పట్టణం వరకు తాగునీటి పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పైపులైన్ ద్వారానే 30 వార్డులకు తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే, 50 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్ కావడంతో ఎక్కడికక్కడే లీక్‌లు ఏర్పడి తాగునీరు సక్రమంగా సరఫరా కావ డం లేదు. ముఖ్యంగా పట్ట ణ శివారులోని వైకేఎం, జనశక్తి, వివేకానంద, నవిరి, గిజబ, తదితర కాలనీలకు తాగునీరు అందడం లేదు. గత ప్రభు త్వాల హయాంలో వైకేఎం, నవిరి కాలనీలకు పైపులైన్లు వేసినప్పటికీ ఫలితం లేదు. గత కొన్నేళ్లుగా శివారు కాలనీలకు ట్యాంకర్లతోనే తాగునీటిని అందిస్తున్నారు.



శివారు కాలనీలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

ముంచుకొస్తున్న వేసవి ముప్పు

పార్వతీపురం మున్సిపాలిటీలోని 30 వార్డుల ప్రజలకు ప్రతిరోజూ తాగునీటి సరఫరా చేయడం అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వర్షాకాలం, శీతాకాలంలో తాగునీటి సమస్య కొంత వరకు ఉండదు. కానీ, వేసవి కాలంలో మాత్రం దాహం కేకలు వినిపిస్తుంటాయి. వేసవిలో నాగావళి నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫిల్టర్ బావులకు నీరు అందదు. దీనివల్ల ప్రతి ఏడాది ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంగా మారిన మూడేళ్లలో చుట్టు పక్కల మండ లాల నుంచి వేలాదిమంది ఇక్కడికి తరలి వచ్చారు. పట్టణ శివారులో ఇళ్లు కట్టుకు ని నివాసముంటున్నారు. దీనివల్ల జనాభా భారీగా పెరిగింది. అయితే, ప్రజల అవసరాల మేరకు తాగునీటి వనరులను కల్పించడంలో అధికారు లు విఫలమవుతున్నారు. నీటిని నిల్వ చేసే ట్యాంకులు (మిగతా 8వ పేజీలో..)

ప్రకటనలే తప్ప పనుల్లేవు..

ప్రతి ఏడాది తాగునీటి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, ఆ పనులు ఎక్కడ చేశారో తెలియడం లేదు. ఎప్పుడైనా పాలకవర్గ సమావేశంలో తాగునీటి సరఫరాకు సంబంధించి కౌన్సిల్ సభ్యులు ఇంజనీరింగ్ అధికారులను నిలదీస్తే పనులు ప్రారంభిస్తామని చెప్పడం.. తరువాత చేపట్టకపోవడం పరిపాటిగా మారింది. పాలకులు కూడా ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి తరువాత మరచిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాగావళి నది వద్ద ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ నుంచి రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన పైపులైన్ నిర్వహణను గాలికొదిలేశారని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. పాత పైపులైన్ స్థానంలో నూతన పైపులైన్‌ను తాగునీటి సరఫరాకు ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. వేసవి ముంచుకొస్తున్న నేపథ్యంలో కనీసం రెండు రోజుల కొకసారైనా తాగునీరు సరఫరా చేయాలని జిల్లా కేంద్ర వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది

- నామినేషన్ల ఉపసంహరణకు ముగిసిన గడువు
- 27న పోలింగ్



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది పోటీలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఈసీ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే విశాఖ జిల్లాలో 12 ఎంసీసీ బృందాలు, ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ నియమించామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు (పురుషులు 13,508 మంది, మహిళలు 8,985) మంది ఉన్నారన్నారు. మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చున్నామని, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నామని, ఓటర్లకు వివరాలతో స్లిప్పులు అందజేస్తామన్నారు. పోలింగ్ తరువాత బ్యాలెట్ బాక్సులు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరుస్తామని, మార్చి 3వ తేదీన అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెల 25 సాయంత్రం 4 గంటల తరువాత ప్రచారం నిర్వహించకూడదని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డీసీపీ అజితా వేజెండ్ల, డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

భయంగొల్పేలా..

- గుంతలమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు
- కానరాని మరమ్మతులు
- బిల్లులు పెండింగ్
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



నవగాం-వండువ రహదారిపై గోతులు



మక్కువ-సాలూరు రహదారి ఇలా..

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం చాలా రహదారుల పరిస్థితి మెరుగుపడినప్పటికీ కొన్నిరోడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతేడాది 97 రహదారుల పనులకు సంబంధించి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు 40 పనులు పూర్తి చేసి రూ.10 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశారు. కానీ, ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో పార్వతీపురం-కోరాపుట్ రోడ్డు పనులను కేంద్ర నిధులు రూ.8 కోట్లతో ప్రారంభించారు. ఈ పనులను అప్పటి ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించిన ప్పటికీ నేటికీ బిల్లులు చెల్లించలేదు. సుమారు రూ.5.54 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. సాలూరు నియోజకవర్గంలోని సాలూరు నుంచి దుగ్గేరు వయా మక్కువ రోడ్డు పనులకు రూ.56 కోట్లు మంజూరు చేసినట్లు జగన్ సర్కారు చెప్పినప్పటికీ పనులు మా త్రం పూర్తికాలేదు. కేవలం రూ.4.5 కోట్ల విలువైన పనులు మాత్రమే చేపట్టారు. మిగిలిన పనులు పూర్తి కాలేదు. పాలకొండ నియోజకవర్గంలోని వండువ-నవగాం రహదారి మరమ్మతులకు రూ.1.50కోట్లు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అయితే, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పనులు జరగలేదు. గత ఏడాదే నిధులు మంజూరైనప్పటికీ టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడం, అగ్రిమెంట్లు జరగకపోవడం తదితర కారణాలతో పనులు జరగలేదు. పార్వతీపురం-పాలకొండ రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు మరమ్మతులు ఎప్పుడు పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇంజనీర్ల కొరత..

ఆర్‌అండ్‌బీ శాఖలో పూర్తిస్థాయిలో ఇంజనీర్లు లేకపోవడంతో ఆ శాఖ ద్వారా చేపట్టాల్సిన పనుల్లో జాప్యం జరుగుతుంది. 13 మంది జూనియర్ ఇంజనీర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురు మా త్రమే ఉన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది. సీతంపేట, వీరఘట్టం, తోటపల్లి, మక్కువ, సీతానగరం తదితర మండలాల్లో జూనియర్ ఇంజనీర్లు లేరు. సాలూరులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది.

పనులు పూర్తి చేస్తాం

ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొన్ని రహదారులకు టెండర్లు పూర్తయినా అగ్రిమెంట్లు పూర్తికాలేదు. అగ్రిమెంట్లు పూర్తయిన తర్వాత పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అప్‌లోడ్ చేసిన వాటికి బిల్లుల చెల్లింపు త్వరలోనే జరుగుతాయి. ప్రజలకు ఇబ్బంది లేకుండా రహదారులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఎస్.రామచంద్రరావు,
ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్‌అండ్‌బీ

ఏనుగుల బీభత్సం

- 80 ధాన్యం బస్తాల ధ్వంసం
- మామిడి, కొబ్బరి చెట్లు కూడా..



నాగూరులో సంచరిస్తున్న ఏనుగులు

బలిజిపేట/గరుగుబిల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలం పెద్దింపేటలో ఏనుగులు బీభత్సం సృషించాయి. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గ్రామంలోకి ప్రవేశించి రైతులు కల్లాల్లో నిల్వ చేసిన 80 ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. అలాగే, మూడు మామిడి చెట్లు, రెండు కొబ్బరి చెట్లను కూడా నాశనం చేశాయి. దీంతో రైతులు మజ్జి దుర్గారావు, మాచర్ల వెంకటనాయుడు తదితరులు లబోదిబో మంటున్నారు. అటవీశాఖాధికారులు సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారాన్ని అందించాలని కోరుతున్నారు.

నాగూరులో ప్రత్యక్షం..

గరుగుబిల్లి మండలం నాగూరులో గురువారం ఏనుగుల గుంపు ప్రత్యక్ష మైంది. గిజబ, నందివానివలస, సంతోషపు రం, సుంకి, పిట్టలమెట్ట, శివ్వాం, సీమలవా నివలసలలో సంచరించిన గజరాజులు నాగావళి నదీ మార్గం గుండా నాగూరు చేరుకున్నాయి. దీంతో ప్రజలను అటవీశాఖ సిబ్బంది అప్రమత్తం చేశారు. గత ఐదేళ్లుగా ఏనుగుల సంచారంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దింపేటలో ధ్వంసమైన ధాన్యం బస్తాలు

విద్యార్థుల బంగారు భవితకు కృషి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కొమరాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని విక్రమపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలు, ఆంగ్ల భాషపై వారికి ఉన్న పరిజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కార్డుల్లో నమోదు చేసిన విద్యార్థుల హిమోగ్లోబిన్ స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో కౌమార దశ బాలికలు, గర్భిణుల్లో 75 శాతం పైబడి రక్తహీనత ఉంది. రక్తహీనతను అధిగమించేందుకు విద్యార్థులకు భవిత కార్డులను అందజేసి సమగ్ర ఆరోగ్య పరీక్ష వివరాలు పొందుపరుస్తున్నాం. హిమోగ్లోబిన్ 7శాతం కంటే తక్కువ ఉన్న వారికి మంచి పౌష్టికాహారం అందిస్తున్నాం. వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకుని నెల నెలా రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారించాలి. ఎనీమియా యాక్షన్ కమిటీలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు చదువుతో పాటు ఆరోగ్యం చాలా అవసరం. ఇష్టంతో చదివి విజయం వైపు పయనించాలి.' అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు భవిత కార్డులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు, ఎంపీడీవో మల్లికార్జునరావు, మండల విద్యాశాఖాధికారి తిరుపతి, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు లెక్కలు చెబుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాఠాలు చెప్పిన కలెక్టర్

కురుపాం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉపాధ్యాయ అవతారమెత్తి విద్యార్థులకు పాఠాలు బోధించారు. గురువారం రాత్రి కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన పల్లె నిద్ర చేపట్టారు. ముందుగా రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ డాక్టర్ శంకరరావును పిలిచి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్‌ను వెంటనే బాగు చేయాలని హెచ్‌ఎం రామగోవిందను ఆదేశించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించారు. బోర్డుపై వారికి లెక్కలు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమహేశ్వరి, తహసీల్దార్ రమణమ్మ, ఏటీడబ్ల్యూవో చంద్రబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీరాజ్ ఏఈల సస్పెన్షన్

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం, పనుల్లో ప్రగతి లేకపోవడంతో ఇద్దరు పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్లను సస్పెండ్ చేస్తున్నట్టు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న వివిధ ఇంజనీరింగ్ పనులపై గురువారం తన కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. గత మూడు నెలలుగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో చేపడుతున్న పనుల్లో ఎటువంటి ప్రగతి కనిపించలేదన్నారు. దీంతో గుమ్మలక్ష్మీపురం ఏఈ మురళీధర్, కురుపాం ఏఈ పి.నాగేశ్వరరావును సస్పెండ్ చేశారు. అలాగే ఆయా ప్రాంతాల ఇంజనీర్లకు షోకాజ్ జారీ చేయాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్య క్రమం కింద జిల్లాలో 572 పనులు మంజూరు చేయగా, కేవలం 19 శాతం మాత్రమే పనులు జరగడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లను, ఇతర సిబ్బందిని మార్పులు, చేర్పులు చేయడంతో పాటు ఇతర ప్రాంతాలకు బదిలీలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నా రు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్ర శేఖర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో తండేల్ సందడి



మాట్లాడుతున్న నాగచైతన్య, సాయిపల్లవి



డ్యాన్స్ చేస్తున్న సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్

ఘనంగా విజయోత్సవం

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్‌ల డ్యాన్స్

శ్రీకాకుళం/అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళం వెనుక ఓ చరిత్ర ఉంది' అని సినీ హీరో అక్కినేని నాగచైతన్య పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారుల యధార్థ గాథ ఆధారంగా తెరకెక్కించిన 'తండేల్' సినిమా విజయోత్సవ సభను గురువారం రాత్రి శ్రీకాకుళంలో నిర్వహించారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన ఈ వేడుకలో సినీ తారలు నాగ చైతన్య, సాయిపల్లవి, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు, దర్శకుడు చందు మొండేటి, రచయిత కార్తీక్ సందడి చేశారు. ఈ సినిమా ఇతివృత్తానికి మూలమైన గనగళ్ల రామారావు, నూకమ్మ దంపతులతో కలసి సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. అనంతరం 'నమో నమఃశివాయ, హైలెస్సో హైలెస్సా' పాటలకు సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్ డ్యాన్స్ చేశారు. ఆ తర్వాత పోలీసులతో కలసి 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కథానాయకుడు నాగచైతన్య, నాయిక సాయిపల్లవితో పాటు చిత్ర యూనిట్ సభ్యులను అభిమానులు గజమాలలతో సత్కరించారు.

యాస కోసం ఎటకారం సేస్తే రాజులమ్మ జాతరే: నాగ చైతన్య

'శ్రీకాకుళం ప్రేక్షకులందరికీ వెరీ వెరీ గుడ్ ఈవెనింగ్. చందూ మొండేటి, కార్తీక్ నాకు ఈ కథ చెప్పడంతో తొలుత డి.మత్స్యలేశం గ్రామానికి వెళ్లాను. అక్కడ మత్స్యకారుల చేపల వేట, వల ఎలా విసురుతారు.. ఇవన్నీ తెలుసుకుని నేర్చుకున్నా. ఆ తర్వాతనే 'తండేల్' రాజు కేరెక్టర్‌కు డిజైన్ చేశారు. సినిమా రిలీజైన తర్వాత అందరి మన్ననలు అందుకున్నా. ఈ కేరెక్టర్‌తో ఎంతో ప్రేరణ పొందాను. శ్రీకాకుళం వెనుక ఓ చరిత్ర ఉందని తెలుసుకున్నా. శ్రీకాకుళమే ఒక అద్భుతం. ఆ కేరెక్టర్ చాలా కష్టమైనది. ప్రాంతాన్ని బట్టి నీటి రుచి మారుద్ది.. మట్టి వాసన మారుద్ది.. గాలి తీరు మారుద్ది.. అలాగే యాస, బాస మారుతుంది. యాస కోసం ఎటకారం సేస్తే రాజులమ్మ జాతరే. దద్దా సెప్పినాగా.. ఈ పాలి యేట దుల్లగొట్టేస్తామని. తండేల్ సినిమా రాజులమ్మ జాతర.. మీరందరూ చాలా జాగ్రత్తగా వెళ్లాలి. సాయిపల్లవి ఇక్కడకు వచ్చి మీ ప్రేమను తెలుసుకున్నారు. అల్లు అరవింద్, వాసు, చందూ మొండేటి.. వారు లేకపోతే నేను ఇక్కడకు వచ్చేవాడిని కాదు.

కథ వినగానే కంట తడి పెట్టుకున్నా: సాయిపల్లవి

శ్రీకాకుళం జనాలను చూసినందుకు ఆనందంగా ఉంది. గనగళ్ల రామారావు (ఒరిజినల్) చెప్పినప్పుడే శ్రీకాకుళం ప్రజలకు థ్యాంక్స్ చెప్పేందుకు సిద్ధమయ్యాం. మత్స్యకారుల జీవితాల్లో ఇంతటి డ్రామా ఉంటుందని తెలిసి.. పాకిస్తాన్ జైలులో గడిపి... అక్కడి నుంచి విడుదల కావడానికి పడిన కష్టాలు వింటూనే కంటతడి పెట్టుకున్నా. వీరి జీవితాన్ని సినిమా తీయడానికి అనుమతించినందుకు కృతజ్ఞతలు. ఇటువంటి పాత్రలో నటించడం దేవుడందించిన భాగ్యంగా ఫీలవుతున్నా. రామారావుతో కూర్చుని కథ కోసం మాట్లాడేటప్పుడు.. రెండు గంటల్లో ఈ సినిమా ఎలా పూర్తవుతుందని అనుకున్నా. కానీ డైరెక్టర్ చక్కగా చిత్రీకరించారు. కథపై నమ్మకముంది. విన్నప్పుడే ఇటువంటి పాత్రలు చేయాలని అనుకున్నా. శ్రీకాకుళం యాస నేర్చుకునేందుకు యోగి అనే వ్యక్తి శిక్షణ ఇచ్చాడు. అందరికీ కృతజ్ఞతలు. మీ రుణం తీర్చుకోలేను. మానిటర్ వెనుక చాలా హ్యాపీగా ఉన్నాం. ఒక సెట్‌గా ఈగో లేకుండా ఉన్నాం. స్నేహితులందరం కలసి సినిమా తీసినట్లయ్యింది. మా డైరెక్టర్ చాలా కూల్‌గా సలహాలు ఇచ్చారు.

శ్రీకాకుళం జనాలు దుల్లగొట్టేశారు: దర్శకుడు చందు మొండేటి

శ్రీకాకుళం జనాలు దుల్లగొట్టేశారు. ఉత్తరాంధ్ర నుంచి సినిమా తీస్తే.. ప్రపంచం నలువైపులా ఆదరించేలా కథ తయారైంది. సక్సెస్ వరించింది. లేడీ సూపర్‌స్టార్.. మా పవర్‌స్టార్ సాయిపల్లవి అంగీకరించడమే ఈ సినిమాకు పెద్ద విజయం. నా ప్రేమకథ స్వీయ అనుభవం.. లీడర్ షిప్ అల్లు అరవింద్. క్వాలిటీగా సినిమా రావడానికి వంశీ, శేఖర్ ఎంతో ఉపయోగపడ్డారు. వీళ్లకు థ్యాంక్యూ. నాగ చైతన్య, సాయిపల్లవి కెమిస్ట్రీ బాగా కుదిరింది. లవ్‌స్టోరీ నుంచి బాగా ఉంది. హిట్ పెయిర్‌గా ఉన్నారు. అరవింద్ గారి వద్ద పది సంవత్సరాలు పనిచేస్తే విజయాలు వచ్చేస్తాయి.

కోడి రామ్మూర్తి జీవిత గాథను వెబ్‌సిరీస్‌గా తీస్తాం : నిర్మాత అల్లు అరవింద్

ఈ ప్రాంతం నుంచి తీసుకున్న కథ ఆధారంగా 'తండేల్' సినిమాను తెరకెక్కించాం. ప్రజలు ఎంతగానో ఆదరించారు. శ్రీకాకుళం ప్రజలకు రుణపడి ఉంటా. శ్రీకాకుళం కోసం తెలుసుకుందామని ఆలోచన వచ్చినప్పుడు కోడి రామ్మూర్తి గొప్పదనం గురించి చదివా. ఈ ప్రాంతంలో పుట్టి.. ఎన్నో ఛాలెంజ్‌లు చేసి శ్రీకాకుళానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారు. ఆయన కథ ఆధారంగా వెబ్ సిరీస్‌గానీ.. సినిమా గానీ తీసే ఆలోచనలో ఉన్నాం. రోడ్డుపై రెండు కార్లు ఆపగలిగిన కోడి రామ్మూర్తి శాఖాహారి కావడం.. ఓ శాఖాహారి ఇంత గొప్ప యోధుడిగా ఎదగడమన్నది స్ఫూర్తినిచ్చింది. 'తండేల్‌'లో నాగచైతన్య, సాయిపల్లవిని దర్శకుడు తోలుబొమ్మలుగా చేసి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. సినిమా చూసిన ఎవరూ ఆ పాత్రలను కానీ.. నాగచైతన్య సాయిపల్లవిలను మరిచిపోలేరు. నాగార్జున కోసం మంచి కథ తయారవుతోంది. కథ రాగానే సినిమా తీస్తాం. ఈ సినిమా ప్రాఫిట్‌ను బన్నీ వాసుతో షేర్ చేసుకుంటా. మా అబ్బాయిలకు షేర్ ప్రాఫిట్ ఇస్తా. ఆ సినిమాతో మరో సినిమా తీస్తా.

డి.మత్స్యలేశం.. ఓ సంచలనం: నిర్మాత బన్నీ వాసు

రెండు రోజుల్లో ఇంతటి జనం వస్తారని ఊహించలేదు. శ్రీకాకుళం వచ్చేటప్పుడు ఇక్కడి ప్రజలు ఎంతగానో ఆదరిస్తారని విన్నాను. అది ఇక్కడి జనాన్ని చూడగానే అర్థమైంది. శ్రీకాకుళంలోని డి.మత్స్యలేశం గ్రామం సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది. 'తండేల్' సినిమాతో మత్స్యలేశం మత్స్యకారుల గాథను ప్రపంచానికి తెలియజేశాం.



'డ్రగ్స్ వద్దు బ్రో'.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

సాయిపల్లవి ప్రాణం పోశారు : రచయిత కార్తీక్ తోట


చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ కోసం శ్రీకాకుళం రావడం ఆనందంగా ఉంది. జిల్లా వాసిగా ఈ చిత్ర కథ రాయడం.. ఇంతటి విజయాన్ని చవిచూడడం ఇంకా ఆనందంగా ఉంది. కో ప్రొడ్యూసర్ భానుకి కథ చెప్పాక.. బన్నీ వాసు వద్దకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. అక్కడి నుంచి డైరెక్టర్ చందు మొండేటి నన్ను ఎంతగానో ఆదరించారు. కథ ఇవ్వడంతో రచయిత పని అయిపోలేదు. నన్ను పక్కనే ఉంచి ఆదరించారు. సాయిపల్లవి ఈ సినిమాకు ప్రాణం పోశారు. బన్నీ వాసు లేకుంటే నేను లేను. అక్కినేని అభిమానులు బంగారం.



ప్రేమబంధం.. ఎంతో మధురం!

- తల్లిదండ్రుల అంగీకారంతో ఒక్కటైన వారిలో సంతోషం
- ఒకరిపై ఒకరికి నమ్మకంతోనే ఆనందమయ జీవితం

నేడు ప్రేమికుల దినోత్సవం



- శృంగవరపుకోట మండలానికి చెందిన గోపి, జామి మండలానికి చెందిన రాధ (అసలు పేర్లు కావు) ఒకే కళాశాలలో చదువుకున్నారు. ప్రేమించుకున్న ఈ ఇద్దరూ డిగ్రీ చదువుతున్న సమయంలోనే ఇంట్లో వాళ్లకు చెప్పకుండా పెళ్లి చేసుకున్నారు. తల్లిదండ్రులు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వేరే కాపురం పెట్టారు. చదువులు మధ్యలోనే ఆగిపోయాయి. ఏడాది పాటు సాఫీ గా సాగిన వీరి దాంపత్య జీవితంతో పొరపొచ్చాలు వచ్చాయి. డిగ్రీ పూర్తి కాకపోవడంతో ఇద్దరికీ ఉద్యోగాలు లేవు. ఏదైనా పని చేద్దా మంటే చేత కావడం లేదు. దీంతో ఇల్లు గడవడమే కష్టమైంది. అంత వరకు పరస్పరం కనిపించిన మంచి గుణాలు... వ్యతిరేక లక్షణాలుగా కనిపించడం మొదలు పెట్టాయి. ప్రేమ స్థానంలో ఇద్దరి మధ్య ద్వే షం పెరిగింది. నువ్వెంతంటే.. నువ్వెంతంటూ పంతాలకు పోయారు. ఒకరిని వదిలి మరొకరు వదిలి ఉండలేమని భావించి... పెళ్లి చేసుకున్న ఈ దంపతులు విడిపోయారు. వీరి ప్రేమకు గుర్తుగా పుట్టిన బాబు ఎవరో ఒకరి దగ్గరే పెరగాల్సిన పరిస్థితిని తీసుకొచ్చారు.
- లక్కవరపుకోట మండలానికి చెందిన వెంకటరమణ, కొత్తవలస మండలానికి చెందిన మంగతాయారు (పేర్లు మార్చాం) వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు. విశాఖపట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేసేవారు. ఇద్దరూ రోజూ ఒకే బస్సులో వెళ్లి... వచ్చేవారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయం ఇరు కుటుంబాల వరకు వెళ్లింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కాకపోవడంతో తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. దీంతో హైదరాబాద్ పారిపోయారు. అక్కడ తెలిసిన వారి సహకారం తో పెళ్లి చేసుకున్నారు. జీవనోపాధి కోసం చేరో వస్త్ర దుకాణంలో చేరారు. ఆరు నెలలు తిరగకుండానే ఒకరిపై ఒకరికి అనుమానం మొదలైంది. మరో ఏడాది కలహాల కాపురం మధ్య ఓ పాప పుట్టింది. అయినా ఇద్దరూ విడిపోయారు. పాపకు అన్యాయం చేశారు.
- వేపాడ మండలంలోని ఓ కుటుంబానికి చెందిన తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ప్రేమ వివాహం చేసుకున్నాడు. బిడ్డ మీద ప్రేమతో వీరి వివాహాన్ని తల్లిదండ్రులు ఆమోదించారు. వీరు కొడుకు ఇం టికి వెళ్లినప్పుడల్లా కోడలు ఏదో ఒక వంకతో భర్తతో గొడవ పెట్టుకో వడం.. లేదంటే పుట్టింటికి వెళ్లిపోవడాన్ని గమనించారు. కొడుకు, కో డలి మధ్య గొడవలు వస్తుండడంతో వాళ్ల ఇంటికి వెళ్లడం మానేశా రు. కొన్నాళ్లకు ఇద్దరూ విడిపోయారు. వేర్వేరుగా ఉంటున్నారు.

శృంగవరపుకోట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి)

..ప్రేమించి పెళ్లి చేసుకున్న ఇలాంటి అనేక జంటలది ప్రస్తుతం ఇదే పరిస్థితి. దీనికి కారణం ప్రేమ మీద సరైన అవగాహన లేకపోవడం... బంధాన్ని నిలుపుకోవడం ఎలాగో తెలియకపోవడమేనని చెప్పవచ్చు. సాధారణంగా ప్రేమలో ఉన్నప్పుడు ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్నట్టుగా ఉంటారు. ఒక్కరోజు ఫోన్ కాల్, మేసేజ్‌లు చేయలేకపోయినా ఏదో కోల్పోయినట్లు బాధ పడుతుంటారు. అలాంటి వారు పెళ్లి బంధంలో మాత్రం ఇమడలేకపోతున్నారు. గుండెల్లో పదిలంగా ఉండాల్సిన ప్రేమ ఒక్కోసారి ఆ గుండెలను చీల్చే వరకూ వెళుతోంది. తల్లిదండ్రులను ఎదిరించి వివాహం చేసుకున్న జంటల్లో చాలా మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దూరమవుతున్నారు. సరైన సంపాదన లేకుండా ప్రేమ పెళ్లిళ్లు చేసుకోవడమే దీనికి కారణం. అంతవరకు తల్లి దండ్రుల సంపాదన మీద ఆధారపడే వీరికి సొంతంగా బతికేందుకు అవసరమయ్యే డబ్బు సంపాదించేసరికి తత్వం బోధపడుతోంది. ప్రేమ మైకంలో చదువును నిర్లక్ష్యం చేయడంతో సరైన ఉపాధి పొందలేకపోతున్నారు. పిల్లలు పుట్టేసరికి అసలైన జీవితం అంటే ఏమిటో తెలుస్తోంది. అది అపార్థాలకు... అనర్థాలకు.. విడిపోవడానికి కారణమవుతోంది. ఈ ప్రభావం పిల్లల భవిష్యత్తుపై పడుతోంది.

అప్పట్లో మేలు కోరుకుని..

ఒకప్పుడు ప్రేమిస్తే ఆమె/అతడి తోటిదే లోకంగా బతికేవారు. తల్లిదండ్రులను ఒప్పించి జీవిత భాగస్వామిగా చేసుకోనేవారు. ఆ ప్రేమ దక్కదని తెలిస్తే ఆమె/అతని జీవితం బావుంటే చాలని కోరుకునేవారు. ఇప్పుడు మాత్రం తనప్రేమను కాదన్న వారిని అంతం చేయడమో... నలుగురిలో నగుబాటు చేయడమో ఫ్యాషన్‌గా మారింది. ఇది ఆఖరికి దాడులు... హత్యలకూ దారి తీస్తోంది. ఇది ఎంతమాత్రమూ సమర్థనీయం కాదు.

అవగాహన అవసరం

చూపులు కలిసినంత సులువు కాదు.. మనసులు ముడిపడడం. ప్రేమంటే ఇద్దరిని ఒక్కటిగా చేసే అద్భుత బంధం. ఇలాంటి బంధం కలకాలం సాఫీగా సాగాలంటే పరస్పరం అవగాహన..అభిమానం ఉండాలని ప్రేమ వివాహాలతో ఒక్కటైన జంటలు ఆచరించి చూపిస్తున్నాయి. అలవాట్లు, అభిప్రాయాలు, జీవనశైలి, చూసే దృష్టి ఒకేలా ఉండాలని ఆశించవద్దు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవడం, ఎదుటి వాళ్లను వాళ్లలాగే కొనసాగనిస్తేనే ప్రేమ పదిలంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రతి ప్రేమ బంధంలోనూ ఎప్పుడో ఒకప్పుడు చేదు అనుభవాలు ఎదురవుతుంటాయి. వాటిపై పరస్పరం చర్చించుకొని.. .పరిష్కరించుకుంటే ఆ బంధం శాశ్వతంగా ఉంటుంది.

మేమే సరిదిద్దుకుంటాం..



మాది పెద్దలు కుదిర్చిన ప్రేమ వివాహం. ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్న సమయంలో మా ప్రొఫెసర్‌తో కలసి వాళ్ల స్నేహితుల ఇంటికి వెళ్లాను. అక్కడ చూసిన అమ్మాయే తరువాత నా భార్య అయింది. ఇద్దరి అభిరుచులు ఒక్కటవడంతో మా మధ్య ప్రేమ చిగురించింది. ఈ విషయం మా కుటుంబాలకు తెలిసింది. తల్లిదండ్రుల ఇష్టంతో ఎంఎస్ చదువుతుండగా వివాహం జరిగింది. మాకు ఇద్దరు పిల్లలు. వారు కూడా వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాను. ఇద్దరిలో ఎవరి దగ్గర చిన్న చిన్న పొరపాట్లు జరిగినా మాకు మేమే సరిదిద్దుకుంటాం. ఇదే మేం ఆనందంగా గడిపేందుకు దోహద పడుతోంది.

-డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, అపర్ణ, సీతారాంపురం, శృంగవరపుకోట మండలం

తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం..



నేను డిగ్రీ చివరి సంవత్సరం, నా భార్య ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డాం. మా కుటుంబాలు అంగీకరించలేదు. ఎవరికి వారే మాకు వేరే వ్యక్తులతో వివాహాలు చేయాలని చూశారు. ఎంతో ఒత్తిడి తెచ్చారు. అయినా మేం భయపడలేదు. తల్లిదండ్రుల మాటకు గౌరవించి వేర్వేరుగానే ఉండేవారం. మా పోరాటం ఓపక్క జరుగుతుండగానే.. మరో పక్క ఉద్యోగ ప్రయత్నాలు చేసే వాడిని. ఈలోపు ఇరు కుటుంబాలు మా వివాహానికి అంగీకరించాయి. పెళ్లయిన నెలలోనే నాకు రేణిగుంట సమీపంలో రైల్వే గేటు మేన్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం రైల్వే టీటీ (టిక్కెట్ కలెక్టర్)గా పని చేస్తున్నాను. ఇద్దరు పిల్లలతో విజయవాడలో హాయిగా జీవిస్తున్నాను. ప్రేమించి పెళ్లి చేసుకోవడంపై చూపిన శ్రద్ధ జీవితంలో స్థిరపడేందుకు చూపించాలి. ప్రేమించి వచ్చిన అమ్మాయి మనస్సు తెలుసుకొని నడుచుకోవాలి. అలాగే ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను అర్థం చేసుకుంటే ఎటువంటి గొడవలూ రావు.

-గోకేడ గోవింద, దేవి, అరిగిపాలెం, వేపాడ మండలం

పక్షుల కోసం తనవంతుగా..

- వరి కంకులు సిద్ధం చేసిన మహిళ



చెట్లకు వరి కంకులు కడుతున్న స్వాతి

రాజాం రూరల్/రాజాం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి ఇంకా రానే లేదు. కానీ ఫిబ్రవరి రెండో వారంలోనే ఎండలు మండుతున్నాయి. భానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మనుషులే ఎండకు తట్టుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పక్షి జాతి ఆకలి, దాహార్తిని తీర్చేందుకు తనవంతు కృషి చేస్తున్నారు పట్టణంలోని నరసింహనాయుడు కాలనీకి చెందిన స్వాతి. సొంత పొలంలో పండిన వరికంకుల్ని పదుల సంఖ్యలో గుత్తులుగా కూర్చి... ద్వారాలు, కిటికీలు... ఇంటి ఆవరణలోని చెట్లకు వేలాడదీశారు. వీటి సమీపంలోనే తాగునీటిని సైతం అందుబాటులో ఉంచారు. పక్షులు, ఉడుతలు వరి కంకులను తింటున్నాయని, నీటిని తాగుతున్నాయని స్వాతి తెలిపారు. వాటి ఆకలి తీరుతుంటే సంతోషంగా ఉంటోందని చెప్పారు.



ఇంటి ముందు వేలాడదీసిన వరి కంకులు

నారాయణపురం నేత చీరలకు భౌగోళిక గుర్తింపు

బలిజిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురంలో తయారవుతున్న నేత చీరలకు భౌగోళిక గుర్తింపు లభించినట్టు జియోగ్రాఫికల్ ఇండికేషన్ హైదరాబాద్ లీగల్ కౌన్సిల్ శ్రీవత్స తెలిపారు. ఆయన గురువారం పార్వతీపురం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురంలో చేనేత కార్మికులు తయారు చేస్తున్న 100 కౌంట్ చీరలను తన బృందంతో పరిశీలించారు. నారాయణపురంలో తయారైన 100 కౌంట్ చీరలు దేశంలో మరెక్కడా తయారు కావడం లేదని స్పష్టం చేశారు. నారాయణపురం చేనేత కార్మికులు తయారు చేసే వంద రకాల చీరలకు దేశంలోని అనేక ప్రాంతాల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి నూరు కౌంటు నేత చీరలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కోసం చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోగా వీరికి భౌగోళిక గుర్తింపు లభించినట్టు తెలిపారు. దీనిపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ జనార్దన రావు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటరమణ, డిజైనర్ ప్రసాద్, కార్మికులు వీర్రాజు, నీలకంఠం, వెంకటరావు పాల్గొన్నారు.



నేత చీరలను పరిశీలిస్తున్న హైదరాబాద్ బృందం

వామ్మో.. ఫేకర్ రోడ్డు

● పెరుగుతున్న ఆకతాయిల బెడద
● మందుబాబులతో ఇబ్బందులు


గరివిడిలోని ఫేకర్‌కు వెళ్లే రోడ్డు ఇదే..

గరివిడి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో ఫేకర్ రోడ్డులో ప్రయాణించాలంటే మహిళలు, విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఫేకర్ రోడు మీదుగా నిత్యం దువ్వాం, దుమ్మెద, దేవాడ, తోండ్రంగి, కోనూరు, అర్తమూరు తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటాదరు. ప్రధానంగా గరివిడి, చీపురుపల్లి ప ట్టణాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినిలు సాయంత్రం ఆ టోలు, సైకిళ్లపై వందలాది మంది వెళుతుంటారు. ఈ సమయంలో కొంతమంది ఆకతాయిలు విద్యార్థినిలకు ఇబ్బందులకు గురిచేస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే బైక్‌లపై స్పీడ్‌గా వెళ్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసే ఘటనలు ఇక్కడ సర్వసాధారణమయ్యాయి. దీనికితోడు చీకటిపడితే మందు బాబులు బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు. వీరివల్ల అటుగా వెళ్లే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

గరివిడి ఎస్ఐ ఏమన్నారంటే..

ఫేకర్ రోడ్డు సమస్యపై గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు వద్ద 'ఆంధ్ర జ్యోతి' ప్రస్తావించగా ఇప్పటికే నిఘా పెట్టామని, ఎవరైనా చట్ట వ్యతిరేక పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు 14 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చల్లపేట ఫీడర్ చానల్‌కు సంబంధించి మెయింటినెన్స్ పనుల్లో భాగంగా 14 గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎ.అనంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని దావాలపేట, బూడిపేట, గంగచోళ్ల పెంట, పత్రువాడ, కొనిస, మెంటాడ, మర్రివలస, కొత్తబగ్గాం, చిట్టయ్యవలస, సాలిపేట, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, వెంకమ్మపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు జాతరపై సన్నాహక సమావేశం

చీపురుపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలపై శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నామని ఈవో బి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో సత్యవాణి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్, వైద్యఆరోగ్య, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ శాఖల అధికారులు, సిబ్బంది హాజరవుతారన్నారు. ఆలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు చెక్‌లు

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎంఈవో చక్రధర్ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు రూ.3 వేలు చొప్పున ప్రభుత్వం జారీ చేసిన చెక్‌లను అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, భవిత కేంద్రం ఐఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇకపై భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందవచ్చని నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు.

ఇష్టపడి చదవండి

రేగిడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య అన్నారు. గురువారం మండలంలోని దేవుదళ కస్తూర్బా విద్యాలయంలో టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆట పాటలతో సందడిగా చేశారు. కార్యక్రమంలో సంకిలి, దేవుదళ జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు రామినాయుడు, రాజ్యలక్ష్మి, గ్రామపెద్దలు కోటేశ్వరరావు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో భూమిపూజ

రేగిడి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిలిలో రామాలయ నిర్మాణానికి గురువారం భక్తిశ్రద్ధలతో భూమిపూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు బొంతా సీతారామస్వామి దంపతులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సంకిలి షుగర్స్ సిబ్బంది, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన ఎడ్ల బండ్ల పోటీలు

వేపాడ/లక్కవరపుకోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో సదానందేశ్వర, రామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు అందరినీ అలరించాయి.

మద్దతు ధరకు కొనుగోలు చేయించండి

వేపాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మినుములు, పెసలను వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన వేపాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం క్వింటా పెసలు ధర రూ.8682, క్వింటా మినుములు ధర రూ.7400 ప్రకటించినా అందు భిన్నంగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారన్నారు. పెసలు క్వింటా రూ.6500, మినుములు క్వింటా రూ.7 వేలు చొప్పున కొనుగోలు చేసి రైతులను ముంచేస్తున్నారన్నారు. 10 కేజీల వరకు అదనంగా కాటా వేసి మోసగిస్తున్నారన్నారు.

7న ఎల్లమాంబ సిరిమానోత్సవం


సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న పూజారి

గంట్యాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) గంట్యాడ ఎల్లమాంబ సిరిమానోత్సవం వచ్చేనెల 7న నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఆలయ పూజారి కొండలరావు గొడియాడ గ్రామంలో గుర్తించిన సిరిమాను చెట్టుకు పూజారి కొండలరావు గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం దాన్ని నరికి గంట్యాడకు తరలించారు. ఏటా మహాశివరాత్రి తర్వాత 9వ రోజు గంట్యాడలో ఎల్లమాంబకు సిరిమానోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దారి పొడుగునా సిరిమాను చెట్టుకు మహిళలు పూజలు చేశారు, ముగ్రాటలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, గొడియాడ సర్పంచ్ వెంకటేశ్, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

ధర గిట్టుబాటు కాక ఉచితంగా..


వంకాయలను పంచేస్తున్న రైతు

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. మండలంలోని గంగచోళ్లపెంటలో రైతు కె.నాగరాజు 40 సెంట్ల భూమిలో వంకాయల సాగును చేపట్టారు. పంట చేతికి వచ్చిన తరువాత గిట్టుబాటు ధరపడిపోయింది. పెళ్లిళ్ల సీజన్ అయినా ధర పడిపోవడంతో పండిన పంటను గ్రామంలో ఉచితంగా గురువారం పంపిణీ చేపట్టారు. 30 కేజీల వంకాయల బ్యాగ్‌ను రూ.80 నుంచి రూ.100 దళారులు అడుగుతున్నారని ఆయన వాపోయాడు. మార్కెట్‌లో ఎప్పుడు కేజీ వంకాయల ధర రూ.50 నుంచి రూ. 80 ఉండేదని పంట చేతికి వచ్చిన తరువాత ధర పడిపోవడం దారుణమంటున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూలీల ఖర్చు రాకపోవడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు.

ఖాళీ స్థలాల్లో నివాసితులను గుర్తించండి

రాజాం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠంలోని ఖాళీ స్థలాల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీ కార్యదర్శి గ్రామాల్లోకి వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఇంటి పన్ను లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఏపీవో సాయిరాం ఉన్నారు.

భూ ఆధార్ ఉన్నవారికే 'పీఎం కిసాన్'


రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏవో

రాజాం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భూ ఆధార్ ఉన్న వారికి మాత్రమే పీఎం కిసాన్ వర్తిస్తుందని ఏవో రేణుకాసాయి అన్నారు. గురువారం పొగిరిలో భూ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 25 తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకం, 1-బి, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ చేసిన మొబైల్ నెంబరుతో రైతు సేవాకేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కార్మికుల సంఖ్య పెంచండి

రాజాం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణం పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని రాజాం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం శానిటరీ అధికారి ప్రసాద్‌కు యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. రాజాం 2005లో నగర పంచాయతీగా ఆపై మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యిందన్నారు. అయినా పెరిగిన పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, అనిల్‌కుమార్, గురువులు, బాలరాజు తదితరులున్నారు.

'మాట వినవే మాలక్ష్మీ' పాట విడుదల

చీపురుపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పల్సర్ బైక్ పాటతో తెలుగు సంగీతాభిమానుల మన్ననలు పొందిన రమణ మరిన్ని మంచి పాటలు పాడి ఉన్నత స్థాయికి ఎదగాలని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు ఆకాంక్షించారు. పల్సర్ బైక్ రమణ పాడిన మాట వినవే మాలక్ష్మీ అనే ఆడియో సాంగ్‌ను గురువారం ఆయన తన నివాసంలో విడుదల చేశారు. కార్యక్రమంలో గాయకుడు పల్సర్ బైక్ రమణ, గవిడి సురేష్, దాలయ్య, ప్రభాత్‌కుమార్, గణేష్, ఆనంద్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఫేకర్ పరిశ్రమను తెరిపించండి

గరివిడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో గత 16 నెలలుగా మూతపడిన ఫేకర్ పరిశ్రమను తెరిపించాలని గరివిడి పట్టణ టీడీపీ నేతలు వర్మరాజు, సత్తిరాజు, సూరప్పడు, చిన్న తదితరులు తహసీల్దార్ బంగార్రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ పరిశ్రమ మూతపడటం వల్ల ఫేకర్ మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మెరకముడిదాం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలింగపురంలో శేషసాయినాథ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు అరవెల్లి కృష్ణశాస్త్రి, శ్రీనివాసరావు మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ నిర్వాహకులు శిరువూరి వెంకటరమణరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. డీసీఎంస్ మాజీ చైర్మన్ వెంకటరమణరాజు, శిరువూరి కృష్ణరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

● డ్వామా పీడీ శారదాదేవి


మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

బొండపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలలో అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా రైతులకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. జిల్లాలో 3775 ఫారం పాండ్స్, 1218 గోశాలలు, 11 వేల ఇంకుడు గుంతలు నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతీ మండలంలో 185 ఎకరాల వంతున జిల్లాలో 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకానికి అవకాశం కల్పించామన్నారు. ప్రధానంగా బొబ్బిలివీణల తయారీకి అవసరమైన పనస చెట్ల పెంపకంతో పాటు సపోటా, జామ, కొబ్బరి తదితర మొక్కల పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. ఉపాధి వేతనదారులకు రూ.300 సరాసరి వేతనం లభించేలా చేసే పనిపై పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రమామణి, ఎంపీడీవోలు జి.గిరిబాల, చిన్నంనాయుడు, బొండపల్లి, గజపతినగరం ఏపీవోలు బొడ్డు కృష్ణవేణి, సీహెచ్.రామారావు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షన్ రూ. 9 వేలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మొయిద జంక్షన్‌లో వామపక్ష సంఘాల నాయకులు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పింఛన్‌దారుల సంఘం నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, కనకల పద్మనాభం మాట్లాడుతూ మోదీ తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో పింఛన్‌దారులు పాల్గొన్నారు.

● గరివిడి.: గరివిడి పట్టణంలో ఈపీఎఫ్ పింఛన్‌దారులు గురువారం నిరసన తెలిపారు. గరివిడి ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి సినిమా హాల్ సెంటరు మీదుగా గరివిడి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పింఛన్‌దారుల సంఘ నాయకులు ఎస్ఎస్.మూర్తి, ఎ.గౌరినాయుడు, కంది రామారావు, షేక్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు


మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

గరివిడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి గరివిడి వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా గరివిడి డీఎస్పీ ఎం.రాఘవులు పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో గెలుపుఓటమిలు సర్వసాధారణమన్నారు. ఓటమిపాలైన వారు మరింత శ్రమించి భవిష్యత్తులో గెలుపు దిశగా పరిగెత్తాలని కోరారు. మూడు రోజుల పాటు విజయవంతంగా క్రీడా పోటీలు నిర్వహించిన స్థానిక కళాశాల యాజమాన్యాని అభినందించారు. ముగింపు ఉత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ పి.వి.రమణ, కళాశాల డీన్ ఎం.శ్రీను పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ నిలిపివేత

మెంటాడ ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదచామలాపల్లి సర్పంచ్ బాయి తవుడమ్మ చెక్ పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ అనంతరం కలెక్టర్ సూచన మేరకు ఆయన చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ తవుడమ్మ 2021-2022 నుంచి 2023-2024 వరకు సాధారణ నిధులు, 14/15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో నిబంధనలను ఉల్లంఘించి నట్టు గుర్తించామని డీపీవో వెల్లడించారు. సర్పంచ్ తవుడమ్మ రూ.1,89,497 పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని గ్రీవెన్స్‌లో బి.భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొబ్బిలి ఆర్డీవోను విచారించి నివేదిక అందజేశారన్నారు. చర్యలకు ముందు సర్పంచ్ తవుడమ్మ ఇచ్చిన సంజాయిషీలో సాంకేతిక సమస్య కారణం వల్లనే బిల్లులను బాయి వెంకట్రావు పేరుతో చెల్లింపులు జరపాల్సి వచ్చిందని పేర్కొన్నప్పటికీ నిధులు దుర్వినియోగం జరిగినట్టు రూఢీ కావడంతో సర్పంచ్ చెక్ పవర్ నిలుపుదల చేశామన్నారు. పంచాయతీ నిధులను నిబంధనల ప్రాప్తికి డ్రా చేసేందుకు మెంటాడ విస్తరణాధికారికి బాధ్యతలను అప్పగించామని డీపీవో తెలిపారు.

అక్రమాలు సహించం

● వేగావతిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు
● గనుల శాఖ అధికారి మోహనరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):వేగావతి నది గతి ఏమవుతుందో శీర్షికన గత నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ద్వారా అక్కడ జరుగుతున్న అక్రమాలు వెల్లడించిన విషయం తెలిసిందే. కనీ టస నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నదిని తవ్వుకుపోతుండడాన్ని కథనం ద్వారా వివరించింది. రామభద్రపురం, అలజంగి గ్రామ శివారులో వేగావతి నదిలో నుంచి రోజూ 40 నుంచి 50 ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని రైతులు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదును కూడా కథనంలో ప్రస్తావించింది. దీనిపై జిల్లా గనుల శాఖ అధికారి సి.మోహనరావు స్పందిస్తూ గురువారం వివరణ పంపారు. అలజంగి వద్ద ఎటువంటి రీచ్‌లకు అనుమతి లేదన్నారు. తవ్వకాలపై పర్యవేక్షణ కోసం సెక్రటరీ, వీఆర్ఓ, వీఆర్ఏ, పోలీసులతో బృందాన్ని ఏర్పాటు చేయాలని బొబ్బిలి ఆర్డీవోను కోరినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మోహనరావు స్పష్టంచేశారు.

మురుగునీరు పోయే దారేదీ?

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.గుమడాంలో మురుగునీరు ఎక్కడిక క్కడే నిలుస్తోంది. దాంతో దోమలు విజృంభిస్తున్నాయి. పర్యవసానంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే కారణం. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని నల్లచెరువు కాలువకు మురుగునీరు సజావుగా చేరే అవకాశం లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోతోంది. దుర్గంధం వెదజల్లుతోంది. ఇకనైనా పంచాయతీ పాలకులు స్పందించి మురుగునీరు మళ్లింపునకు చర్యలు చేపట్టాల్సి ఉంది.


ఎం.గుమడాంలో మురుగు కాలువ దుస్థితి

క్రైం న్యూస్

తండ్రిని చంపేశాడు

● మద్యం మత్తులో యువకుడి ఘాతుకం

విజయనగరం క్రైం ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గాజులరేగ పరిధిలో గురువారం ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో తండ్రిని కుమారుడు బలంగా కొట్టడంతో తండ్రి మృతి చెందినట్టు తెలుస్తోంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజులరేగలోని రాజవీధిలో నివాసం ఉంటున్న కరణపు సూరిబాబు(45) తన కుమారుడు సాయి ప్రతి రోజు ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి వాటిని విక్రయించి జీవనం గడుపు తుంటారు. సూరిబాబు తీరు నచ్చకపోవడంతో తన భార్య బంగారు లక్ష్మి కొన్నేళ్లుగా వేరుగా ఉంటుంది. తండ్రి కొడుకులు వచ్చిన డబ్బులతో మద్యం సేవించి నిత్యం గొడవలు పడుతుంటారు. జులాయిగా తిరుగుతున్న కుమారుడు గురువారం తండ్రితో ఘర్షణ పడ్డారు. దాంతో కుమారుడు సాయి.. తండ్రిని బలంగా కొట్టడంతో సూరిబాబు మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మురళి పరిశీలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. సాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆటో బోల్తా: వ్యక్తి మృతి

విజయనగరం క్రైం/దత్తిరాజేరు ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పరిధిలో చెల్లూరు గ్రామ సమీపంలో కోరాడపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలు పాలయ్యారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. దత్తిరాజేరు మండలం వింధ్యావాసి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ టి.సూర్యనారాయణ తన ఆటోలో అదే గ్రామానికి చెందిన బాషా, సన్యాసినాయుడు, షేక్ బాబీలతో కలిసి గురువారం విశాఖ వెళ్లారు. అక్కడ వారి పని ముగించుకుని తిరిగి రాత్రి స్వగ్రామానికి వస్తుండగా చెల్లూరు సమీపంలో కోరాడపేట బ్రిడ్జి వద్ద ఆటో టైర్ పంచర్ కావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడి డివైడర్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్ సూర్యనాయణ తలకు బలమైన గాయాలు కావడం వల్ల అక్కడక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న మిగిలిన ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు సూర్యనారాయణకు భార్య స్వాతి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బొబ్బిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో పురుగు మందు తాగిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఏఎస్ఐ బీవీ రమణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన చనమల దుర్గాప్రసాద్ (45) లేబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత ఐదేళ్ల నుంచి మద్యానికి బానిసగా మారాడు. ఆయనకు భార్య కృష్ణవేణి, పెళ్లయిన ఇద్దరు కుమార్తెలు శైలజ, తనూజ ఉన్నారు. గత నెల సంక్రాంతి పండుగ రోజుల్లో కుటుంబ సభ్యులందరూ దుర్గాప్రసాద్‌కు మద్యం తాగి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని సుద్దులు చెప్పారు. పండుగ ముగిశాక పిల్లలు తమ అత్తవారిళ్లకు వెళ్లిపోయిన తర్వాత భార్య కృష్ణవేణితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో గత నెల 21న రాత్రి భార్యను ఇంట్లో పెట్టి తలుపు గడియ పెట్టాడు. వరండాలో గల గడ్డి మందును తాగాడు. ఇది గమనించిన స్థానికులు దుర్గాప్రసాద్‌ను విజయనగరం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. గత నెల 27 వరకు అక్కడ చికిత్స పొందాడు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి గన్‌మన్ బ్యాగ్ మిస్సింగ్

● బ్యాగ్‌లో 30 రౌండ్ల మ్యాగ్జైన్

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):విజయనగరం వన్ టౌన్ పరిధి కలెక్టరేట్ వద్ద బుధవారం రాత్రి మంత్రి గుమ్మడి సంధ్యారాణి గన్‌మన్ జి.వి.రమణ ఆటోలో వస్తుండగా బ్యాగ్ మిస్ అయిందనీ, ఆ బ్యాగ్‌లో 30 రౌండ్స్ కలిగిన మ్యాగ్జైన్ ఉందని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన బాధితుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కే సమయంలో తన బ్యాగ్‌ను రోడ్డుపై ఆటో పక్కన పెట్టేసి జిరాక్స్ సెంటర్‌కు వెళ్లనన్నారు. తిరిగి వచ్చేసరికి బ్యాగ్ మిస్ అయిందన్నారు. తర్వాత బ్యాగ్ కోసం ఆ పరిసర ప్రాంతాలను వెతికినా దొరకలేదన్నారు. బ్యాగ్ మిస్సింగ్ ఘటనపై ఎస్పీ వకుల్ జిందాల్ సీరియస్ అయినట్టు తెలుస్తోంది. దీనిపై వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా గన్‌మన్ ఫిర్యాదు ఇచ్చారన్నారు. బ్యాగ్ కోసం ఘటన జరిగిన ప్రాంతం సమీపంలోని అన్ని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ బూర్జవలస ఎస్ఐ టి.రాజేశ్ పశువుల వ్యాన్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. గురువారం వాహన తనిఖీల్లో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న బొలేరో వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. ఇందులో ఆరు పశువులను గోశాలకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.


దాడి కేసులో వ్యక్తి అరెస్టు

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యువతిని ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడినందుకు ఇద్దరు యువకుల మధ్య జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఒకరిని గురువారం అరెస్టు చేశామని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు అఅందించిన వివరాల్లోకి వెళితే.. గజపతినగరానికి గ్రామానికి చెందిన మహిళ దుర్గతో అదే గ్రామానికి చెందిన అలజంగి తేజ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పెరుమాళ్ల చంద్రశేఖర్ కలుగజేసుకున్నాడు. ఇది మంచి పద్ధతి కాదని వారించాడు. మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య గొడవకు దారితీసింది. దాంతో ఆగ్రహానికి గురైన తేజ.. సైకిల్ చైన్ తో చంద్రశేఖర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి తల్లి పెరుమాళ్ల తవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కే సు నమొదు చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

గంజాయిని తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గంట్యాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండతామారాపల్లి సమీపంలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని గురువారం గంట్యాడ పోలీసులు అరెస్టు చేశారు. బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన బి.రాముగా గుర్తించారు. అతడి నుంచి 1300 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

సాంకేతిక లోపంలో నిలిచిన రైలు


మెంటాడ రైల్వేగేటు వద్ద నిలిచిన రైలు

గజపతినగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెంటాడ రైల్వే గేటుకు అడ్డంగా గురువారం మధ్యాహ్నం సాంకేతిక లోపంతో రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. ఈనెల 17న రైల్వే జనరల్ మేనేజర్ పర్యటనలో భాగంగా రైల్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సిగ్నల్ పాయింట్‌కు సంబంధించి పనులు చేపడుతుండటంతో సాంకేతిక లోపం తలెత్తింది. దాంతో విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళ్తున్న ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ మెంటాడ గేటు వద్ద నిలిచిపోయింది. దాదాపు అరగంట పాటు గేటుకు ఇరువైపుల వాహనాలు బారులు తీరాయి. సిగ్నల్ పాయింట్ పనులు పూర్తయిన తరువాత రైలు కదిలింది.

చేనేతపై విద్యార్థులకు అవగాహన

రాజాం రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పర్యటనలో భాగంగా పెనుబాకటని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అదే గ్రామంలోని చేనేత సొసైటీని సందర్శించారు. హిందీ ఉపాధ్యాయుడు మధుసూదనరావు ఆధ్వర్యంలో విద్యార్థులు చేనేత వస్త్రాల తయారీని పరిశీలించారు. వస్త్రాల తయారీపై చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. పట్టణంలోని టీడీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు 1/70 చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అరకు, పాడేరు నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారని ఇంటర్ విద్యార్థులను ప్రాక్టికల్ పరీక్షలు వెళ్లకుండా నిరోధించటం సరికాదన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. గిరిజన ప్రాంత ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ● 'జగన్మోహన్‌రెడ్డిని విమర్శిస్తే అహంకారం.. మీరు ఒక రాష్ట్ర మంత్రినైన నన్ను ఏమైనా అనవచ్చు. నాది అహంకారం కాదు, ఆత్మవిశ్వాసం.. మీది అతి బద్ధకం' అని మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను ఉద్దేశించి మంత్రి అన్నారు. విలేకర్లను, అధికారులను చెప్పుతో కొట్టండి అన్న సంస్కృతి మీది, అందరినీ ఆదరించే గుణం నాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, గుళ్ళ వేణు, పరమేష్, కోట్ల లక్ష్మణరావు, దొర లక్ష్మణరావు, వాడాడ శోభారాణి, వైదేహి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన బాధితులకు ఎమ్మెల్యే విజయచంద్ర గురువారం నర్సిపురం గ్రామంలోని తన నివాసం వద్ద చెక్కులను పంపిణీ చేశారు. చిన్నబొండపల్లికి చెందిన పి.లక్ష్మీ కుటుంబ సభ్యులకు రూ.లక్షా 44వేల 617, సీతానగరం మండలం చిన్నభోగిలికి చెందిన పావని కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కును అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోనుదేవిచం ద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

ఎమ్మెల్యే విజయచంద్ర గురువారం తన కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీసీ రోడ్లు తదితర సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. ఉపాధి నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీఇచ్చారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని డీఈవో నల్ల తిరుపతినాయుడు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మన్యం జిల్లాకు తగిన గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాత్రి సమయాల్లో విద్యార్థులు ఏ మేర పరీక్షలకు సిద్ధమవుతున్నారన్న సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో హెచ్ఎం పీసీహెచ్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

సీతంపేట రూరల్,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థినులు ఎటువంటి ఒత్తిడికి గురికావొద్దని డిప్యూటీ ఈవో రవి ప్రసన్నకుమార్ సూచించారు. గురువారం స్థానిక హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినిలకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు హెచ్ఎం ఉమావాణి ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి దళితవాడలో గురువారం స్పెషల్ బ్రాంచ్, క్యాట్ పార్టీ, ఆర్ఎస్ఐ, ఎస్టీఎఫ్ స్టాఫ్, చినమేరంగి పోలీస్‌స్టేషన్ సిబ్బంది సారా తయారీపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 25 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 2,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ● సాలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూలతాడివలస గ్రామ సమీపంలో సారా తయారీ స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసి తొమ్మిది డ్రమ్ములతో నిల్వ ఉన్న 1500 లీటర్లు నల్లబెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు. రెండు లీటర్ల సారాను కూడా గుర్తించి సీజ్ చేశామని చెప్పారు. ● సీతంపేట రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పులుగుమ్మి గ్రామ సమీపంలో స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 540 లీటర్ల బెల్లపు ఊటలను గుర్తించి, ధ్వంసం చేశారు.

మద్యం స్వాధీనం

కొమరాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనేరు చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి తీసుకువస్తున్న 19 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. మద్యం తీసుకు వస్తున్న సాయిరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తోటపల్లిలో హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 13వ తేదీ వరకు, అలాగే జనవరి 8 నుంచి 13వ తేదీ వరకు మొత్తంపై 31 రోజులకు గాను భక్తులు కానుకల రూపంలో రూ.3లక్షల 36వేల 405 వచ్చిందన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రతినిధి బి.అప్పలనాయుడు పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డి.పారినాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాయగడ-విజయనగరం స్టేషన్ల మధ్య నిర్వహిస్తున్న రైల్వే పనులను విశాఖపట్నం డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ గురువారం పరిశీలించారు. ఈ మార్గంలో ప్రతి స్టేషన్‌లో ప్రయాణికుల విశ్రాంతి గదులు, సిబ్బంది క్వార్టర్లు, తదితర వాటిపై చర్చించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రాయగడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పురపాలక కార్య నిర్వాహణాధికారి కుల్దీప్ కుమార్, కౌన్సిలర్లు మజ్జి శ్రీనివాసరావు, బి.రమణలుతో కలిసి గురువారం రాయగడలోని 17, 18 వార్డుల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన వార్డు ప్రజలతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాలువల్లో పూడికలు తీయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● అధికారులతో సమీక్ష

కొమరాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల విషయంలో ఉద్యోగులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం విక్రమపురం గ్రామ సచివాలయంలో ఆయన మండల స్థాయి అధికారులతో పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన రహదారుల నిర్మాణం పనుల పురోగతిపై ఆరా తీశారు. 200 యూనిట్లు పైబడి విద్యుత్ వినియోగదారులను సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో మంజూరైన సామూహిక మరుగుదొడ్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేయాలన్నారు.

ఉపాధి వేతనదారుల సంఖ్య పెంచాలి

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని, అదే విధంగా వారికి వచ్చే కనీస వేతనం రూ.300 వరకు పెరిగే విధంగా అవగాహన కల్పించాల న్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలు కనీసం 55వేలు ఉండాలన్నారు. మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.హేమలత, జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: సంతలో విక్రయదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

సీతానగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సువర్ణముఖి నది తీరాన వెంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామివారిని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, వర్షాలు కురవాలని కోరుకున్నామని కలెక్టర్ తెలిపారు.

పశువులను కబేళాకు తరలించకుండా చూడాలి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రప్రదేశ్): పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పట్టణ శివారులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పశు వుల సంతను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి, వసతులపై ఆరా తీశారు. పశువుల సంతలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వాటిపై జిల్లా మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్‌ను అడిగి తెలుసుకుని, వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువులను అక్రమంగా కబేళా లకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు వాహనాలను సీజ్ చేయాలన్నారు. సంత ఆవరణలో కల్తీ, నకిలీ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం ఉందని, సంబంధిత అధికా రులతో తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పీసా చట్టంపై అవగాహన పెంచుకోండి

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అవగాహ న పెంచుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైటీసీ కేంద్రం లో పీసా కమిటీ సభ్యులతో శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ శిక్షణలను ఉద్దేశించి పీవో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఏ అభివృద్ధి పనులు జరగాలన్నా పీసా కమిటీ తీర్మానం తప్పనిసరిగా ఉండాలన్నారు. పీసా చట్టంపై తొమ్మిది రోజుల పాటు ఇస్తున్న శిక్షణను సభ్యులువిని యోగించుకోవాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎంపీపీ ఆదినారాయణ, ఎంపీడీవో కె.గీతాంజలి, జడ్పీటీసీ ఎస్.లక్ష్మి, శిక్షణల పర్యవేక్షకులు హనుమంతరావు, డీటీఎం లోకనాథం,షెడ్యూల్డ్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● కురుపాం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): పీసా చట్టంపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీసా చట్టంపై మండలంలో గల సర్పంచ్‌లు, కార్యదర్శులు, పీసా కమిటీ సభ్యులు సభ్యులకు పీసా చట్టంపై అవగాహన కల్పిస్తూ శిక్షణ నిర్వహించారు. సామర్లకోట నుంచి ఫెసిలిటేట్ మెంబరు పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఇచ్చారు.

బీహెచ్ఐపీకి జిల్లా ఎంపిక

పార్వతీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం (బీహెచ్ఐపీ)కు పార్వతీపురం మన్యం జిల్లా ఎంపికయ్యింది. ఈ మేరకు నీతి అయోగ్ నేతృత్వంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ ఎల్లిడ్ సైన్సెస్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ గీతాంజలి, గుప్తా, సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్, కె.దమిజ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంకు పార్వతీపురం మన్యం జిల్లా ఎంపికైనట్టు తెలిపారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జిల్లాలో న్యూరోలాజికల్ సమస్యల సంఖ్యను తగ్గించేందుకు ఉపయోగపడుతుందన్నారు. పార్వతీపురం మన్యం కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడు తూ బ్రెయిన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంను జిల్లా ఆసుపత్రి వద్ద బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ టీబీ అధికారి వినోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి



రికార్డులపై ప్రశ్నిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

భామిని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం రీసర్వే పైలెట్ గ్రామం మణిగను పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి గురువారం సందర్శించారు. సర్వేలో రికార్డులు పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. సర్వే పూర్తి కావడానికి ఎన్ని రోజులు అవుతుందన్నారు. పూర్తి విస్తీర్ణం 297 ఎకరాలు ఉండగా, 160 ఎకరాలు పూర్తయిందన్నారు. ఈసందర్భంగా స్థానిక గిరిజనులు తమ సమస్యలను సబ్ కలెక్టర్ వద్ద విన్నవించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులు పరిష్కారంపై ఆరా తీసి, ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. బాలేరు పీహెచ్‌సీని సందర్శించి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ అప్పారావు, డీటీ రమేష్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు పరిశీలన

సాలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా ఆంధ్రా-ఒడిశా ఘాట్ రోడ్డును జాతీయ రహదారి డీఈఈ కె.సత్యప్రసాద్, ఏఈఈ బి.రఘు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్, పాచిపెంట ఎస్ఐ కేవీ సురేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. ప్రమాదాల నివారణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

సక్రమంగా ఫిర్యాదులను పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

సీతానగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కార నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల నుంచి అందిన అర్జీలు పక్కాగా విచారణ చేయాలన్నారు. అనంతరం లచ్చయ్యపేట గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. గ్రౌండ్ ట్రూథింగ్ పక్కాగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఉప తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారిణిగా శ్యామలాదేవి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ అధికారులను నియమిస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా పర్యవేక్షణ అధికారిణిగా టీడబ్ల్యూ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలాదేవిని నియమించారు.

వేసవి గట్టెక్కేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

కూడా లేకపోవడం విచారకరం. భవిష్యత్‌లో ఈ సమస్య జఠిలంగా మారే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం బృహత్తర తాగునీటి పథకం పేరిట హడావుడి చేసింది. పార్వతీపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గాను రూ.33.33 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించి శిలాఫలాకాలను అప్పటి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కానీ, పనులు మాత్రం చేపట్టలేదు. ప్రస్తుతం వేసవి కాలం మొదలైంది. చలి తీవ్రత తగ్గి ఎండలు పెరిగాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో 30 వార్డుల ప్రజలకు మూడు రోజులకొకసారైనా తాగునీటిని సరఫరా చేయగలరా అనే ప్రశ్న తలెత్తుతుంది. దీంతో ఈ వేసవి గట్టెక్కెదెలా? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

ఈ వేసవిలో పార్వతీపురం మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. 30 వార్డుల ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. నూతన బోర్లు ఏర్పాటుకు రూ.6లక్షలు, పైపులైన్ల మరమ్మతులకు రూ.3 లక్షలు, నాగావళి నదిలోని ఇన్‌ఫిల్టర్ బావుల నుంచి హెడ్ వాటర్ వర్క్స్‌కు నీటిని తోడే మోటార్ల మరమ్మతులకు రూ.7లక్షలు, బోర్ల మరమ్మతులకు రూ.3 లక్షలు, నదిలో నీటిని ఇన్‌ఫిల్టర్ బావులకు మళ్లించేందుకు రూ.5 లక్షలతో యుద్ధప్రాతిపదిక పనులు చేపడతాం.

-శ్రీనివాసరాజు, డీఈ, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం

నీటి క్యాన్లు కొనుగోలు చేస్తున్నాం

తాగునీటి సరఫరాపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మూడు, నాలుగు రోజులకొకసారి తాగునీరు అందిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. డబ్బులు ఇచ్చి నీటి క్యాన్లు కొనుగోలు చేసుకుంటున్నాం. ఎన్నాళ్లు ఇలా నీరు కొనుగోలు చేసుకొని తాగాలి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

- జి.మధు, పార్వతీపురం

భయం వేస్తుంది

వేసవి వచ్చిందంటే మాకు తాగునీటి భయం పట్టుకుంటుంది. ప్రతి ఏడాది వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక వైపు బోర్ల నుంచి కలుషిత నీరు వస్తుంది. మరో వైపు తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

- ఆర్.విష్ణు, పార్వతీపురం

ప్రభుత్వ బడులను రక్షించుకుందాం

రామభద్రపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, విద్యారంగాన్ని రక్షించుకునే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. ఆయన గురువారం ఏపీటీఎఫ్ శ్రేణులతో కలిసి బూసాయవలస పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను వెనక్కు పంపించి పూర్వస్థితిని కొనసాగించాలని కోరుతూ 117 జీవోను రద్దు చేయమని కోరామేగానీ మోడల్ స్కూల్స్‌గా ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చమని కోరలేదన్నారు. ఫౌండేషన్ పాఠశాలలను ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తున్నదని అన్నారు. నాయకులు జోగినాయుడు, రామభద్రపురం మండల శాఖ అధ్యక్షుడు చెల్లూరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భక్తదర్శనం, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలో ఉన్న 22 పంచాయతీల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీవో రత్నం సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్త య్యాయనేదానిపై ఆరా తీశారు. ఈ నెలాఖరులోగా గోకులాలు పూర్తి చేయాలన్నారు. వేతనదారులకు రూ.300లు కూలీ వచ్చే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో త్రినాథరావు పాల్గొన్నారు.

ఉరి తాళ్లతో నిరసన

● నాగావళి నదిపై వంతెన పనులు ప్రారంభించాలని డిమాండ్

కొమరాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగావళి నదిపై పూర్ణపాడు - లాబేసు గ్రామాల మధ్య వంతెన పనులను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి, తదితరులు గురువారం నాగావళి నదిలో దిగి.. మెడకు ఉరి తాడు బిగించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి తూర్పు వైపున ఉన్న 32 గిరిజన గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రావాలంటే నది దాటి రావలసిన పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి తరుణంలో ఈ వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు.



మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

బెలగాం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయాలని, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.2 వేలు అపరాధ రుసుం విధిస్తారని జిల్లా ఉప రవాణా శాఖ అధికారి ఎం.శశికుమార్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహన షోరూం డీలర్స్ ఇన్సూరెన్స్ సర్వేయర్లకు ఇన్సూరెన్స్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన 48 గంటల్లో సంబంధిత అన్ని శాఖలు ఐ-ఆర్ఏడీ యాప్‌లో అప్లోడ్ చేస్తే ఇన్సూరెన్స్ బాధితులకు తొందరగా వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో జి.సీతారాం, మెడికల్ ఆఫీసర్ డీపీ నారాయణరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతు బజార్లు ఏర్పాటు చేయండి

వీరఘట్టం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలోని పాలకొండ, వీరఘట్టంలో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. గురువారం ఆయన అమరావతిలో మంత్రిని కలిశారు. రైతు బజార్లు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని, అలాగే ప్రజలకు తక్కువ ధరకే కూరగాయలు అందుతాయని తెలిపారు. వీలైనంత త్వరగా రైతు బజారు ఏర్పాటు చేయాలని ఆయన మంత్రిని కోరారు.

ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రప్రదేశ్): దేశంలోని అటవీ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని బందంవారి వీధిలో గల కలాసీ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందన్నారు. వామపక్ష, ప్రజా సంఘల నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గరుగుబిల్లి గురుకుల ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. బాలికల వసతి గృహంలో ఐదో తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన వారు మార్చి 6 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

సాలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అ న్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు కళాశాల ల్లో కూడా పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈగల్ క్లబ్‌లో ఆ విద్యాసంస్థకు చెందిన ప్రిన్సిపాల్, హెచ్ఎం, ఇద్దరు సిబ్బంది, ఎనిమిది మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఈ క్లబ్ ముఖ్య ఉద్దేశ్యం మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న వారి పై నిఘా పెట్టి, మానే విధంగా కౌన్సిలింగ్ ఇచ్చి, అవసరమైతే వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: చినమేరంగి, పెదమేరంగి, చినకుదమ జడ్పీ ఉన్నత పాఠశాలలు, చినమేరంగి కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్స్ ఫర్ లా ఎన్ఫోర్స్‌మెంట్) క్లబ్‌లు ఏర్పాటు చేశారు. చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ ఆయా పాఠశాలల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి, పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.